# యహా వ

'వహా మావది ఉత్త షేక్స్‌పియర్ మొహావ్' అన్నాడు జగన్నాథం స్టీలు మరచెంబులోంచి లడ్లు తీసి పంచిపెడుతూ ఆఫీసులో.

"ఈ సూటు మా పిన్నత్తగారు పెట్టింది. అఫ్‌కోర్స్ ఆవిడకి మనవంటే చాలా యిది. ఓ ఫిఫ్టీ రుపీస్ ఎందుకైనా వాడుకోమని చేతిలో పెట్టింది. మా మావుత్త రోగ్గండోయ్- అది చూశాడు. వెళ్ళొస్తానంటే, జాగ్రత్తగా వెళ్ళిరా అంటాడేవిటి అరుగుమీద నిలబడి. ఓ హండ్రెడో అందులో హాఫో - చేతిలో పెట్టాలా ఖర్చులకి. ఏవీలేదు. నన్ను చూస్తూనే ఏడుపు మొహం పెట్టేశాడు" అంటూ ధుమ ధుమ లాడిపోతున్నాడు బారసాల పెళ్ళికొడుకు జగన్నాథం.

"నువ్వేదో చేసుంటావ్-వాళ్ళకి కోపం వచ్చుంటుంది" అన్నాడతని కొలీగ్ విశ్వనాథం

"అబ్బ-నేనేం చెయ్యలేదయ్యా- నాకు ఎమీబియాసిస్ మోషన్స్‌తో నేను ఇబ్బందిపడుతుంటే... మా మావ చాలా ఇండిఫరెంటుగా వున్నాడు. ఆ వాహనా లేదు, విసర్జనా లేదు"

అని గింజుకున్నాడు. అది సర్లె ఇంతకీ మీ వాడికి ఏం పేరు పెట్టారు.

"అది చాలా గొడవయిందయ్యా - నేరకపోయి కన్నాం వీడిని అనిపించింది. మావిడ బెంగాలీ పేరు పెట్టుకుందావండీ అంది. మా అత్తగారికి వెంకటేశ్వరస్వామి పేరు పెట్టుకోవాలనుంది. మా పిన్నత్తగారికి - దవిడో - ఆమె భర్త పేరు సీతారామయ్య పెడితే వెండిగిన్నె, బిళ్ళల మొలతాడు, మురుగులు, మురిడీ గొలుసులు చేయిస్తానంది."

"మరి నీకో?"

"నాకేమో పాటకు పెట్టేసి ఎవరెక్కువ ఆఫరిస్తే వారి పేరు పెట్టేద్దాం అనుంది."

"మరి మీ మావగారో?"

"ఆయనకు తన పేరెవరైనా సజస్ట్ చేస్తారేమోనని వుంది. ఎవరూ ఎత్తకపోయేసరికి కుదేలైపోయాడు."

"చివరికేం చేశారు?"

"వెంకట సీతారామాంజనేయులు పెట్టేశారయ్యా!"

"అదేమిటి ఆంజనేయు లెలాగొచ్చాడు?"

"మా మావ ఆంజనేయో పాసకుడట."

"సరిపోయింది. మీ ఆవిడకు కోపం రాలేదూ?"

"వచ్చింది. అనిల్‌కుమార్ అని పిలుచుకుంటానంది. అలా పిలవకుండా వుండేందుకు మా పిన్నత్తగారో పట్టుచీర, మా అత్తగారో వాంగ్రడదూ దానికిచ్చి శాంతింపచేశారు.

మనకి అందులో ఓ పిష్టీ ముట్టిందనుకోండి. అది వేరే సంగతి. మా మావ చాలా ఇండిఫరెంటుగా వున్నాడయ్యా-"

"మీ మావ కొంచెం ఇండిఫరెంటుగా వుంటే, మీ ఆవిడ్ని కొంచెం సరిచేస్తే పోలా?"

"అదెక్కడ దొరికింది నాకు? నేనున్న ట్వెంటీ ఫోరవర్సులో ఫోర్ మినిట్సు నాతో మాట్లాడిందేమో! మా పెద్ద మరదలు ఢిల్లీ నుంచొచ్చింది. దాని కొత్త కాపరం ముచ్చట్లు ఆరాతీయడంతో అక్కగారికి సరిపోయింది. దేరీజె మెస్సై బవుట్ హర్!"

"మెస్సేవిటి?"

"అదో పెద్ద జేమ్స్‌బాండ్ స్టోరీ. క్రయిం అండ్ సెక్స్-"

"అయ్యబాబోయ్!"

"మా మరదలు బియస్సీ మాత్స్. పరమ దైవభక్తి. తులసికోట కనబడితే రవుండ్లు కొట్టేస్తుంది. స్త్రీ సూక్తం కంఠతావచ్చు. అష్టపదులూ, త్యాగరాయ కీర్తనలూ, ఆధ్యాత్మ రామాయణం దంచేస్తుంది. పైగా తెగ చదవడం వలన దానికి పి. య్యూ. సీ నుంచే కళ్ళజోడు వచ్చేసింది."

"పాపం సనాతనిస్ట్ పిల్లన్నమాట."

"పరమ కన్సర్వేటివ్ - పరీక్షలు ప్యాసవడమేగాని ఓ సినిమాలు, బుక్సు పత్రికలూ ఇవేమీ తెలీవు. సీతారామాంజనేయ యుద్ధం, భక్తకన్నప్ప యిలాంటి సినిమాలకు వెళ్తుంది."

"మీ ఆవిడకూడా యిలాంటి చాదస్తపు సరుకేనా?"

"ఆ గూట్లో చిలకే—కాని దీనికి బాగా ట్రెయినింగ్ యిచ్చి మోడ్రన్ గా ఉండమనీ, అమ్మమ్మలా బిహేవు చెయ్యొద్దని నూరిపోశా."

"ఏమన్నా ఫలితం కనిపించిందా?"

"రోమ్‌లో వున్నప్పుడు రోమన్‌లా వుండవే అన్నాను. సిటీలోకొచ్చాక కూడా ముసలమ్మలా ఆచారాలు, మళ్ళా, వెర్రి పూజలూ వద్దన్నాను. తలూపుతుంది కాని విన్దు. మడి కట్టడం, ఉపవాసాలు మాన్పించాను. దానికి ఉపవాసమైతే వంట చెయ్యదు. దానితో పాటు రాత్రిళ్ళు వుప్పిడిపిండి, దిబ్బరొట్టె తినాలంటే ఏడుపొస్తుంది. ఏదన్నా జనరల్ నాలెడ్జికి పనికొస్తుంది డైలీ పేపరు చదవ్వే అంటే దయ్యాన్ని చూసినట్లు జడుసుకుంటుంది. బీకాం ప్యాసయిందికాని మా ఆవిడ ఇంగ్లీషులో రెండు ముక్కలు మాట్లాడాలంటే ఫిట్టొచ్చేస్తుంది"

"మరెల్లా ప్యాసయిందయ్యా బీకాం-"

"ఏమయిందీ- పిక్కా పట్టేసి కొశ్చన్లకి ఆన్సర్స్ రాసేసుంటుంది."

"తెలివైందే- కొంచెం నువ్వే సానపట్టాలి."

"ఏం లాభం? ఓసారి వాళ్ళింటికెళ్ళిందంటే జిడ్డోడుతూ తయారవుతుంది. అస్సలు మా మావే—శుద్ధ స్కాండ్రల్- ఆడపిల్లల్ని రాచిప్పల్లా తయారు చేశాడు,"

"మీ మరదలు కూడా డిట్టోయేనా?"

"ఆ అమ్మాయికి పురుషద్వేషం వుండేది మొగుడి

దగ్గరకు రానిచ్చేది కాదు. ఛీ ఛీ అసయ్యం అంటూ గర్భా దానం గదిలోంచి పారిపోయొస్తే - మా పిన్నత్తగారూ వాళ్లూ బుజ్జగించి, కేకలేసి, కొట్టినంత పనిచేసి మళ్ళీ గదిలోకి తోశార్ట!"

"పాపం మీ తోడల్లుడికి ఈ అమ్మాయి పెద్ద ప్రాబ్లం అన్నమాట!"

"అదేంలేదు. వాడే యిప్పుడు వాళ్ళకి ప్రాబ్లం తెచ్చి పెట్టాడు. వాడి హిస్టరీ అంతా ఓ బ్లూఫిల్మనుకో..."

"అదేవిటి? కథ అడ్డం తిరిగింది"

"అతను ఢిల్లీలో సెంట్రల్ వాటర్ అండ్ పవర్ కమీషన్లో అసిస్టెంట్ ఇంజనీర్ సివిల్. ఈ అమ్మాయిని కాపరానికి తీసికెళ్ళగానే- నెల్లాళ్ళు ఆఫీసుకు సెలవు పెట్టాడట. ఎలా లాంగతీశాడో మనకయితే మిస్టరీయేగాని—ఇంటినిండా కామ సూత్రాలు, కొక్కోకం బొమ్మలూ, ఫోర్నోగ్రఫేయేట, ఆ పిల్లని ఒక్క నిమిషం వదలకుండా అదే యావట— పైగా సెలవుపెట్టి దానితో హడలిపోయి ఆ అమ్మాయి చెప్పకుండా పారిపోయొచ్చింది.

మా మావగారు అంతకన్నా పూలయ్యా— పూరుకో వచ్చా! జాన్సన్ లాగ పెద్ద పెద్ద గంభీరమైన మాటల్తో ఇంగ్లీషులో చిన్న అల్లుడ్ని మందలిస్తూ ఉత్తరం రాశాడు.

ఇంత సున్నితమైన విషయంలో ఏం రాస్తాడు—ఎంత మావగారైనా.

"రాశాడయ్యా బొక్కింగ్లీషు– స్త్రీ సున్నితమైన గులాబి పువ్వులాంటిది. దాన్ని పవిత్రంగా జాగ్రత్తగా గంగోదకంలా వాడుకోవాలి. స్త్రీ మనస్సు చాలా మృదువయింది. ఆ మనస్సుని గాయపరచకుండా ప్రేమగా చూడాలి. శారీరకమైన వాంఛలను తీర్చుకుందుకుగాదు. భగవంతుడు మనకి మానవ దేహాన్ని ప్రసాదించింది ప్రతి దేహం ఒక దేవాలయం అందులో జ్ఞానమనే దీపాన్ని వెలిగించుకోవాలి. ఐహికసుఖ లంపటత్వాన్ని జయించి ఆముష్మిక మార్గాన్ని వెదుక్కుంటే జీవుడికి ముక్తి లభిస్తుంది. అంటూ చాటభారతమంత రాశాడు."

"ఇంజనీరుగారికి కోపం రాలే..."

"ఆ ఉత్తరంతో వెయ్యి రూపాయల చెక్కు పంపించాడు– బారసాలకొచ్చి నాల్రోజులుండి మమ్మల్నానందపరచి వెళ్ళమని."

"ఆ జేమ్సుబాండుగాడొచ్చి యిక్కడ ఆ అమ్మాయిని విడవకుండా అల్లరి పెడితే ఎంబరాసింగ్‌గా వుండదూ మీ వాళ్ళకి. పైగా పల్లెటూళ్ళో అంతా నవ్వుతారు ఇంత యావేవిటని. అతనొచ్చాడా?"

"రాలేదు కాని వస్తాడనుకొని గది అరేంజ్ చేశారు. మా ఆవిడ దానికి ఏదో లెక్చరిస్తూండటం, వాళ్ళిద్దరూ కరటక దమనకుల్లా ఒకర్నొకరు అంటిపెట్టుకొని చెవులు కొరుక్కోవడం చూశాను. అసలు నా సంగతెవరూ పట్టించుకోలేదు. వెయ్యి రూపాయలు తీసుకొని మరదలకి చిన్న లవ్

లెటరూ, మావగారికి అపాలజీ లెటరూ రాసి, ఇకనుంచి మీ అమ్మాయిని పువ్వుల్లో పెట్టి పూజిస్తానని అతి వినయంగా రాషడు."

"నీకంటే మీ తోడల్లుడే రెండాకులెక్కువ చదివి నట్లుంది.

"ముందొచ్చిన చెవులకంటె వెనక వచ్చిన కొమ్ములు వాడి. వాడు రాలేదు గాని వాడొస్తే వాడికి నా చేత బ్రీఫింగ్ యిప్పిద్దామని మా మావ ప్లాన్ వేశాడట. వాడికోసం గ్యాలి యర్ సూటింగ్ తెప్పించి వాడు రాకపోయేసరికి మా మర దలుకిచ్చి పెట్లో పెట్టుకోమన్నారు. నాకేమో, జరీనేతపంచ, నూలుజరీ కండువా పెట్టారయ్యా పీటలమీద. మా ఆవిడకు పట్టుచీర—చూడు ఎంత ఇన్నల్లో—"

"ఇవన్నీ మీ మిసెస్సుతో విడమర్చి చెప్పాల్సింది రాత్రి గదిలో కొచ్చినప్పుడు."

జగన్నాథం మొగం తెల్ల తెలపోయింది.

"రాత్రా—రాత్రి అది నా దగ్గరికొస్తేగా"

"అంటే మీకు సెపరేట్ గా గదివ్వలేదా!"

"మా మావ పుత్రస్కాపుంద్రులని చెప్పాగదటోయ్—"

"అదేవిటోయ్ ఏడాది ఎడబాటు తర్వాత—"

"ఏడాది కాదనుకో, ఎనిమిదినెల్లు"

"ఎంతో కొంత— బారసాలకొచ్చినపుడు భార్యాభర్త లకి గదివ్వరటోయ్ మీ అత్తగారు యిలాటివి చూడరా!"

"ఖర్మ" అని నెత్తి బాదుకున్నాడు జగన్నాథం.

"మీ ఆవిడకు ఆపాటి చనువులేదా- ఎలాగా మీ మర దలుకోసం అరేంజిమెంట్లు చేశారుగదా - అవి వేస్టయి పోవూ?"

"మా మావగారు అలా వేస్టు కానివ్వడు పూచికపుల్ల నష్టం రానివ్వడు."

"ఇంకేం నీ రొట్టె విరిగింది, నేతిలో పడింది."

"నా రొట్టె విరగలేదు. విరిగింది ఆయన రొట్టె."

"నువ్వు చెప్పేది అర్థం కావడంలేదు. కాస్త క్లియర్ గా చెప్పు."

మా అత్తగారూ, మా మరదలూ, మా ఆవిడ అప్ప చెల్లెళ్ళలా వుంటారు. ముగ్గురూ కార్బన్ కాపీలు- కొత్త వారికి ఎవరెవరో పోల్చుకోడం కష్టం. ఇందాక కాఫీ యిచ్చిం దెవరో, తరవాత టిఫిను పెట్టిందెవరో. ఆఖర్న ప్లేటు ఎత్తేసిం దెవరో ఇంగ్లీషు సినిమాలా పరధ్యానంగా వుంటే తెలీదు.

"చచ్చే చావే- పరమడేంజరు కూడాను"

"నాకు ఓపెన్ గా హాల్లో మడతమంచం వేశారు. నాకు కుడివైపున మా పెద్ద బావమరిది యల్లెమ్మా నవారు మంచం వాల్చుకుని వ్యవసాయపు కబుర్లు మొదలెట్టి చంపుకు తిన్నాడు మా ఆవిడ, మరదలు, మా పిన్నత్తగారు చాపవేసుకుని పడు కుని సోదికబుర్లు మొదలెట్టారు. ఈ మడతమంచం టెంపరరీ యేమో, పిలుస్తారని ఆశ పెట్టుకుని మా బావమరిది గుర్రుకొడు

తూంటే, గతిలేక వ్రాఁకోడుతున్నాను, ఇంట్లో పిల్లలు అంతా బావా బావా అది చెప్పు" యిది చెప్పు అని నన్ను అల్లరి పెడుతూంటే, అది ఓరగంట చూస్తూ — నాకు జరిగిపోతున్న అన్యాయానికి ఆనందిస్తూ కూర్చుంది. నేను ఎన్ని లవ్ సిగ్నల్స్ చేసినా, చిటికె వేసినా, దగ్గినా, సకిలించినా బేఖాతరుగావుంది. మంచినీళ్ళంటే "ఒరే చిన్నా, బావకి స్టీలు గ్లాసులో మంచి నీళ్ళియ్యి" అని పురమాయించింది. మా మావగారు యిటూ అటూ పచార్లు చేస్తూ మధ్య మధ్యన మనవణ్ణి ముద్దులాడుతూ ఈ యావత్తు కథకి మూలపురుషుణ్ణి నన్ను సింపుల్‌గా ఇగ్నోరు చేసేశారు. మనవణ్ణి యిచ్చింది మీ అమ్మాయే నన్నుకోండి, నేను కూడా కొంత ఇంపార్టెంట్ గదా అని అనుద్దావనిపించింది. కాని గది అనేది వుందిగదా, ఏమవుతుందో చూద్దావని ఓపిక పట్టాను."

"బలే సస్పెన్సోయ్. తర్వాతేం జరిగింది?"

"ఛార్ మినార్ పీలుస్తూ మడతమంచం పట్టాను. తిండి పెట్టారు బట్టలిచ్చారు. తిండీ బట్టలతో పాటు జీవితంలో ఎంతో ముఖ్యమైన సెక్సుకి యింత చిన్న చూపేవిటి? నామటుకు నేను విలవిల్లాడిపోతున్నాను. కళ్ళు మూసుకుంటే సర్రియలిస్టిక్ డ్రీమ్సు వస్తున్నాయి. సరే మనకెంతుంటుందో అవతలవాళ్ళకందులో పీసమంతయినా వుండకపోతుందా అనిపించి లేచివెళ్ళి కాల్తో మా ఆవిడ పాదాన్ని కాస్త నొక్కి మన డిమాండ్ ప్రెస్ చేశాను. మా మరదలు లేచి కూచుని "అక్కోయ్ బావో

చ్చాడు. నీకోసం శే లెమ్మని గుంజింది. అప్పుడు నాకు శరత్ బాబు నవలల్లో ఆడాళ్ళు "భూమాతా బద్ధలయిపో" అంటారే ఆ డైలాగ్ గుర్తుకొచ్చి "సారీ మాధవీ, ఎక్స్‌క్యూజ్ మీ" అనేసి చీకట్లో కలిసిపోయి తల పట్టుకున్నాను. సొంత పెళ్ళాం కోసం యిన్ని ఏడిపులా అనిన న్ను చూస్తే నాకే జాలేసింది. మా ఆవిడ నా వెనకాలేవచ్చి "ఛీ! ఛీ! బుద్ధుండాలి. ఇంత యావేమిటి బావకని అది నవ్వుతోంటే నా ప్రాణం చచ్చి పోయింది. ఇంతకీ ఏమిటి మీ గోల" అని కసురుకుంది ప్రాణేశ్వరి.

"చాలా అక్వర్డు పొజిషన్‌లో పడ్డావే—"

"మన బతుకే అక్వర్డు డిక్షనరీ అయిపోయింది గదా అని విచారించి—ధైర్యం తెచ్చుకుని, మనకి మీవాళ్ళు గదెందుకివ్వలేదు, నువ్వెందుకని వూరుకున్నావ్ అని గొంతు తగ్గించి హోమియోపతిక్ డోస్‌లో అడిగాను. నా ఆరోగ్యం పాడవుతుందని, యిప్పుడే బారసాల నాడే మంచిది కాదని మావాళ్ళనుకున్నారు అంది అయినా మీరు వూరికే వెలితి పడతారు దేనికి — పడుకోండి నన్ను అల్లరి పెట్టక మీరు అల్లరి పడక అని వెళ్ళిపోయింది."

"మొత్తానికి సీక్రెటిప్పంతా వేస్టయిందంటూ, మీవాళ్ళు చాలా ఇర్రెస్పాన్సిబుల్, క్రూయలోయ్, గదివ్వకపోటం యింటల్లుడికి ఇన్సల్టే! ఇంతకీ మీ మరదలి గది గురించి చెప్పావుకాదు,"

“వస్తున్నాను వస్తున్నా. ఆ రాత్రేం జరిగిందో తెల్సా— మడతమంచాన్నీ, మావగారినీ, హాల్నీ నా జాతకాన్నీ తిట్టుకుంటూ పడుకున్నానా — ఓ రాత్రివేళ నా మీద ఏదో పడింది. అదో గెడకర్ర దాన్ని పట్టుకుని గుంజాను. కిటికీ అవతల ఎవడో పరుగు— అడుగుల చప్పుడు— దొంగ దొంగ అని అరిచాను. లైటేశారు. అంతా లేచారు అప్పుడు ఏం జరిగిందండీ అంటూ మా ఆవిడ నా చెయ్యి పుచ్చుకుంది సరిగ్గా అదే టైంలో ఆ ఏకైక బెడ్రూంలోంచి ముందు మా అత్తగారు జుట్టు ముడేసుకుంటూ వస్తే, ఆ వెనకాల మా మావ గుండెల మీదకి గ్లాస్కో పంచెను చుట్టుకుంటూ “ఏవిటేవిట”ని వచ్చాడు. నా ప్యాంటూ, షర్టూ పాకెట్లో యావత్తు కరెన్సీనోట్లూ అన్నీ తుడిచిపెట్టుకు పోయాయ్. ఎంతేవిటన్నాడు మా మావ. “మూడొందల యాభై” అన్నాను. దొంగలు పడ్డప్పుడు పోలీసులకు తగ్గించి చెప్పాలి, ఇంట్లో వాళ్ళకి అత్తారైతే కాస్త ఓ వంద పెంచవచ్చు!

“ఆపావు. ఆ గదిలోంచి మీ మావా అత్తా రావడం పబ్లిగ్గా అంతా చూశారంటావ్.”

“అదేవిటోయ్ మా మావ బనీనంతా తడిసుంటేను. ఆవిడ మొహంనిండా ముత్యాలజల్లు. ఆవిడ అలా చీకట్లోకి జారుకున్నారు, మా ముందు నిలబడకుండా. నేను మా ఆవిడకేసి టీజింగ్‌గా చూశాను, అది తల తిప్పేసుకుంది. నాకు తెలీకడుగుతాను పెద్దాళ్ళకుకూడా అంత యావ వుంటుందోయ్?”

కథా నిలయం
1220
శ్రీకాకుళం



"మనం అలాంటి విషయాలు పనిగట్టుకుని తవ్వకూడదు. ఆ గది చూసి మీ మావ మనసుపడి వుంటాడు. ఆ దొంగ వెధవెవడో వాళ్ళ పరువు బయటపెట్టాడు అంతే—"

"కొశ్చన్ అది కాదోయ్! మమ్మల్నిలా యేడిపించి వాళ్ళలా గదిలో దూరడం న్యాయమంటావా?"

"పెళ్ళిళ్ళ కార్యం కరామత్తుల్లో సాధారణంగా యిలాంటి వింతలూ విడ్డూరాలూ జరుగుతూ వుంటాయ్ మన యిళ్ళల్లో. తప్పట్టగూడదు, సింపతైజ్ చెయ్యాలి ఇంతకీ ఆ మర్నాడు బిచాణా ఎత్తేశావా?"

"లేదోయ్, ఎమీబియాసిస్ కదా! ఈ మోషన్స తగులుకుని నీరసం వచ్చేసింది. మంచం దిగలేక పోయాననుకో, ఆ మర్నాడు కొన్ని హిమాలయన్ బ్లండర్స్ చేసేశాను."

"అదేంటోయ్-హిమాలయన్ బ్లండర్సేంటి?"

"చెప్పానుగా మా అత్తగారు మావిడా కార్బన్ కాపీల్లా వుంటారని. మా అత్తగారు పిల్లాడ్ని ఒళ్ళో కూచోపెట్టుకుని ఆడిస్తున్నారు. ఆవిడ వెనక్కి తిరిగి కూచున్నారు. ఆ తోపు రంగు జరీచీర మా ఆవిడది కట్టుకున్నారు కాబోలు, వెనకనుంచి భుజంమీద చెయ్యేసి రాత్రి మీ అమ్మా నాన్నా లవ్‌లో పడ్డం ఎలావుంది అన్నాను. ఆవిడ లేచి కెవ్వుమని అరిచి పెద్ద గంతువేసి లోపలికి పారిపోయారు. నేను జరిగిన పొరపాటు గ్రహించే లోపల ఏవిటేవిటని మా ఆవిడా, మా మావ, మా పిన్నత్తగారూ, మా బామ్మర్ది నాలుగు దిక్కుల్నుంచీ

వచ్చారు, మీ అమ్మాయనుకుని పలకరిస్తే ఆవిడ కంగారు పడ్డారు. క్షమించాలి నా వల్ల పొరపాటయింది అన్నాను సిన్సియర్‌గా. మా ఆవిడ నా రెక్క పుచ్చుకుని, ఇదివరకు మా కివ్వని గదిలోకి తీసికెళ్ళి నాకు ముక్కచీవాట్లేసింది, తలగోడకు కొట్టుకుని చస్తానంది. నేను బిక్కమొహం వేసుకుని, నన్ను క్షమించు చిట్టీ నేను వెళ్ళిపోతాను. ఇంక ఇక్కడకూడ వుండనని పెట్టే బేడా సర్దుకుని రైలుస్టేషన్కి రిక్షా మాట్లాడుకుని వచ్చేశాను."

"అబ్బా-చాలా గ్రంథవే జరిగిందోయ్! నువ్వు అలా కోపంగా వచ్చేస్తూంటే మీ వాళ్ళు వూరుకున్నారా?"

"మా మావ ధుమ ధుమ లాడ్తూనే వున్నాడు. కాని స్టేషన్కి మా పెద్ద బావమరిది, మరదలూ వచ్చారు. మా పిన్నత్తగారు ఓ యాభై పంపించారు. మా అత్తగారు ఓ యాభై, మా ఆవిడ ఓ ముప్ఫయ్ యిచ్చారు. అన్నిటికంటె చిత్రం ఏమిటంటే మా మరదలు తన పెట్లోంచి గ్వాలియర్ సూటింగ్ పీసెస్ తెచ్చి యిచ్చి, బావా నీ బట్టలు పోయాయి గదా నువ్ కుట్టించుకో అని వద్దంటూన్నా బలవంతాన నా సంచీలో కుక్కింది. ఆ పిల్ల ఆపేక్షకి నా కళ్ళనీళ్ళు తిరిగాయ్. మీ నాన్న నేనంటే ఎందుకంత ధుమ ధుమ లాడ్తున్నాడు నేనేం పాపం చేశాను అని అడిగాను. మా మరదలు నవ్వి- "ఏంపీ అనుకోకు బావా - నువ్ స్టీలు మరచెంబు తెచ్చావే- అది ఫం క్షిలో కడిగి మా నాన్నకు పెట్టా. ఆ మరచెంబు

బ్రాందీ వాసన కొట్టిందట. అదిగాక నువ్వు మంచినీళ్ళు పోసుకుందుకు తెచ్చిన సీసా విస్కీ సీసాట. అది చూసి మా నాన్న యితను డబ్బిస్తే అంతా పాడుచేస్తాడని ధుమ ధుమ లాడిపోతున్నారు అంతే మరేంలేదు అంది. మా మావ ఎంత ఫూలో చూడు."

"బారసాలకెళ్ళూ మర చెంబులో బ్రాందీ పోసుకుని ఎవరెళ్ళమన్నారోయ్? బుద్ధిలేకపోతే సరి. నీదే తప్పు."

"అవున్లే-నీకీ కథంతా ఏకరువు పెట్టింది. నీచేత తిట్టించుగోడానికా?"

"నువ్వే వసుగోకు. డ్రింకుమీద నీ కింత 'యావ' పనికి రాదు. తగ్గించుకోవాలోయ్!"

"రేపు మా ఆవిడ రానీవోయ్. నీచేత యీ మాటనిపించుకుంటానేమో-కమాన్ లెటజ్ గో ఫరె డ్రింక్." ★